ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

గురువారం 3 ఏప్రిల్ 2025

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 20.0

'రైతులకు సాంకేతికంగా కానీ, ఆర్థిక వనరుల రూపంలో కానీ అన్ని విధాలా తోడుంటాం' అని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ జడ్.వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ జేడీతో బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని రైతులు నేరుగా వారి సందేహాలు, సమస్యలను ఆంధ్రజ్యోతి ద్వారా ఫోన్‌లో జేడీఏ దృష్టికి తీసుకొచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తెలపడంతో పాటు పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో పురుగుమందుల వాడకం తగ్గించేలా విప్లవాత్మకమైన వ్యవసాయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

రైతులకు తోడుంటాం



వారి సమస్యలు పరిష్కరిస్తాం.. ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వరరావు హామీ

- ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు
- వరి దుబ్బులు కాల్చకుండా అవగాహన కార్యక్రమాలు
- ఎరువుల వాడకం తగ్గించేందుకు, భూసారం పెంపునకు రైతులకు నవధాన్యాల విత్తనాల పంపిణీ




వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో ఎద్దు బండి చిత్రం

భీమవరం టౌన్/భీమవరం అర్బన్/ తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) :

ముందుగా ఐకేపీ సెంటర్లు ప్రారంభించాలి

- జిల్లాలో వరికోతలు చాలా చోట్ల ముందస్తుగా ప్రారంభిస్తున్నారు. అదేవిధంగా ఐకేపీ సెంటర్‌లు ప్రారంభిస్తే రైతులు ధాన్యం అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది.
  - కేశిరెడ్డి దిలీప్, మాదివాడ, ఆకివీడు రైతు

జేడీఏ: తాడేపల్లిగూడెంలో ఈనెల మూడో తేదీన తొలి ఐకేపీ కేంద్రం ప్రారంభిస్తున్నాం. అవసరమైతే అన్ని ప్రాంతాల్లో ప్రారంభిస్తాం.

నీరు బయటకు వెళ్లేలా చూడండి

- ఆకివీడు రాజులపేటలో గోపరాజు కోడు నుంచి నీరు బయటకు వెళ్లే మార్గం లేక కింద ఆయకట్టు ఎండిపోతుంది.
  - ఎం.నాగేంద్ర, రైతు ఆకివీడు

జేడీఏ: అధికారులకు తెలిపి సమస్య పరిష్కరిస్తాం

వరి దుబ్బులు కాల్చొద్దు

- దాళ్వాలో కోతలు కోసిన తరువాత వరిదుబ్బులు కాల్చకుండా నివారించేలా చర్యలు తీసుకోవాలి.
  - టీవీ సుబ్బారావు, భీమవరం రైతు

జేడీఏ : వరి దుబ్బులు తగలబెట్టడం వల్ల కలిగే అనర్థాలను గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలిస్తాం.

- రుస్తుంబాద ప్రాంతంలో మురుగు కాల్వ ఆక్రమణలకు గురికావడం వల్ల 400 ఎకరాలు పంటకు పనికిరాకుండా పోతోంది. ప్రతీ ఏటా ఇదే పరిస్థితి. చర్యలు తీసుకుంటే 500 మంది రైతులకు మంచి జరుగుతుంది.
  - కూనపరెడ్డి వీరవెంకట రంగారావు, నరసాపురం

జేడీఏ: డ్రెయిన్స్ శాఖతో ఈ విషయం చర్చించి రైతులకు మేలు జరిగేలా చూస్తాం.

తక్కువ సమయంలో పంట రకాలు కావాలి

- సార్వాలో దీర్ఘకాలిక (150 రోజులకు) పంట వచ్చే రకాలు వేయడం వల్ల పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడి రైతులు నష్టపోతున్నారు. తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే రకాలు వేసేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలి.
  - సీహెచ్ రామ్మోహణరావు, మండపాక.

జేడీఏ: తక్కువ సయయంలో చేతికి వచ్చే రకాలను ఇప్పటికే రైతులకు పరిచయం చేశాం. ఎన్ఎల్ఆర్ 3238 రకం వల్ల మంచి ఆరోగ్య పోషకాలతో పాటు 120 రోజులకే పంట చేతికి వస్తుంది. ఈ రకాన్ని పరీక్షిస్తున్నాం, సక్సెస్ అయితే రైతులకు అవగాహన కల్పిస్తాం.

పంట నష్టపరిహారమివ్వాలి

- ఎర్రకాలువ వరదల వల్ల జూలైలో పంట నష్టం వాటిల్లగా ఇప్పటివరకు పరిహారం అందలేదు. విజయవాడ బుడమేరు రైతులకు ఇచ్చినట్టు రూ.10వేలు పరహారం అందించాలి.
  - పరిమి వీరభద్రరావు సొసైటీ మాజీ అధ్యక్షుడు నవాబుపాలెం.
  - ముళ్లపూడి రామకృష్ణ, జగన్నాథపురం.

జేడీఏ: పరిహారం త్వరలోనే అందుతాయి. ప్రభుత్వ జీవోలను అనుసరించి రూ.6800 పరిహారం అందించనున్నాం.

53 సెంట్ల భూమి చూపండి

- గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేలో భాగంగా మాది 53 సెంట్లు లేనట్టు చూపించింది. అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఇప్పుడైనా సమస్య పరిష్కరించండి. మహిళా ఉద్యోగుల ఇబ్బంది దృష్ట్యా రైతు సేవా కేంద్రాల వద్ద టాయిలెట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.
  - పీవీఎస్ గోపాలకృష్ణంరాజు, యండగండి, రైతు

జేడీఏ: రీ సర్వే ఇబ్బందులను రెవెన్యూ అధికారులు సభలు నిర్వహించి పరిష్కరించే చర్యలు చేపట్టారు. రైతు సేవా కేంద్రాల్లో టాయిలెట్స్ ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాలతో ఉపాధి హామీ నిధులతో నిర్మించేందుకు చర్యలు చేపట్టాం.

- మా ప్రాంతం రైతు సేవా కేంద్రంలో సహాయకులు లేక రైతులకు సరిగా సేవలు అందడంలేదు. ఆర్.కంద్రిక, కె.కుముదవల్లి ప్రాంతాల్లో వెయ్యి ఎకరాల వరకూ సాగు భూమి ఉంది. రైతులు ఇబ్బంది పడుతున్నాం.
  - పంపా నాగేశ్వరరావు, కె.కుముదవల్లి.

జేడీఏ : సిబ్బంది కొరత ఉంది, రేషనలైజేషన్ ద్వారా సిబ్బందిని నియమించే చర్యలు తీసుకుంటాం.

రసాయనాల వాడకంలో జిల్లాకు మూడో స్థానం

ఎరువుల వాడకం తగ్గించేందుకు నవధాన్యాల విత్తనాలు : జేడీఏ

రసాయన ఎరువులు వాడకంలో మన జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉంది. ఎరువుల వాడకం తగ్గించే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. దాళ్వా తరువాత రసాయన ఎరువుల వాడకం తగ్గించేందుకు, భూసారం పెరిగేందుకు కోతలు కోసిన భూముల్లో చల్లేలా నవధాన్యాల విత్తనాలు అందిస్తున్నాం. 12 కేజీల కిట్ ఇస్తారు. దీనిలో 15 నుంచి 25 రకాల విత్తనాలు ఉంటాయి. పప్పుదాన్యాలు, తృణ ధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, నూనె గింజలు, ఆవాలు, నువ్వులు, అపరాల విత్తనాలు ఉంటాయి. ప్యాకెటు రూ.750-800 ఉంటుంది. ఇప్పటికే 25వేల ఎకరాలకు సం బంధించి కిట్‌లు అందజేశాం.. రైతులు వినియోగి స్తున్నారు. మరో 25 వేల ఎకరాలకు సిద్ధం చేస్తున్నాం.

- రాబోయే రోజుల్లో భూసార పరీక్షలు నిర్వహించి జింక్ లోపాలు ఉన్న భూముల రైతులకు ఉచితంగా జింక్ అందిస్తాం. డ్రోన్ల ద్వారా పురుగు మందులను పిచికారీ చేస్తే ఖర్చు సగానికి సగం తగ్గుతుందన్నారు. పొలాల్లో వరి దుబ్బులకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. దుబ్బులను అంటించకుండా డీకంపోజ్ అనే మందును 200 లీటర్ల నీటిలో కేజీ బెల్లంతో మందును కలిపి 24 గంటలు ఉంచిన తరువాత దుబ్బులపై పిచికారీ కానీ, కల్లాపులా చల్లితే చాలు దుబ్బు కుళ్లిపోతుందని అవగాహన పెంచుకోవాలన్నారు.

సబ్సిడీపై సామగ్రి అందించండి

- గతంలో రైతులకు సబ్సిడీపై టార్పాలిన్‌లు, పవర్ టిల్లర్‌లు, ఇతర సామగ్రి ఇచ్చేవారు. కానీ గత ఐదేళ్లలో వాటి ఊసేలేదు.
  - ఎన్.రవికుమార్, ఆచంట వేమవరం.
- మా ప్రాంతంలో ఎక్కువగా చిన్న సన్నకారు రైతులే దమ్ముచేసుకునేందుకు ప్రభుత్వం నుంచి రోటోవేటర్‌లు కానీ చిన్న ట్రాక్టర్‌లు కానీ అందించాలి.
  - కొవ్వూరి కళ్యాణ శ్రీనివాసరెడ్డి, పెంటపాడు.

జేడీఏ: సబ్సిడీపై గత ఏడాది చివర్లో 140 పవర్ టిల్లర్‌లు మాత్రమే వచ్చాయి. వాటిని కొంతమందికే ఇవ్వగలిగాం. ఈ ఏడాది అందరికీ సబ్సిడీపై పవర్ టిల్లర్‌లు, రోటోవేటర్లు అందిస్తాం. టార్పాలిన్‌ల కోసం 83 వేల యూనిట్‌లు కావాలని ప్రతిపాదనలు పంపించాం.

టెన్షన్.. టెన్షన్

- జిల్లా మదుపుదారుల్లో ట్రంప్ సుంకాల భయం
- ఇప్పటికే భారీగా నష్టపోయిన ఇన్వెస్టర్లు
- ప్రతీకార సుంకాలు విధిస్తే నేడు ఇండెక్స్ భారీ పతనం!

7



7 రోజుల్లో రూ.9.76 కోట్లు

- మొత్తం రూ.71.96 కోట్లకు రూ.64.18 కోట్లు వసూళ్లు

భీమవరంటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీల్లో ఆస్తి పన్ను వసూళ్లు పెరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతనెల 25 నుంచి ఏడు రోజుల పాటు వడ్డీలో 50 శాతం రాయితీ ఇస్తూ జీవో విడుదల వల్ల ఏడు రోజుల్లో రూ.9.76 కోట్లు ఆదాయం పెరిగింది. ఈ మేరకు అధికారులు లెక్కలు కట్టారు. ఇంకా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ 30వ తేదీ ఉగాది, 31న సోమవారం రంజాన్ పండుగల కారణంగా కొంత తగ్గిందని అంచనా వేశారు. మార్చి 31వతేదీకి జిల్లాలోని ఆరు మునిసిపాల్టీల్లో రూ.71.,96 కోట్లు వసూళ్లు కావాల్సి ఉండగా రూ.64.18 కోట్లు వసూళ్లయింది. ఆస్తి పన్ను, కుళాయి పన్ను వసూళ్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేయడంతో వసూళ్లు వేగవంతంగా పెరిగాయి. చివరిలో వడ్డీ రాయితీ కొంత ఉపయోగపడిందని చెబుతున్నారు. వడ్డీ రాయితీ వల్ల మునిసిపాల్టీలకు కొంత ఆర్థిక పరంగా నష్టం జరిగినా, ఒకేసారి ఎక్కువ మొత్తంలో ఆదాయం రావటం, బకాయిలు తగ్గుదలకు దోహదపడిందని చెబుతున్నారు.

ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీతో మునిసిపాల్టీలకు పెరిగిన ఆదాయం

జిల్లాలో 5 మునిసిపాల్టీలు, ఒక నగర పంచాయతీ వసూళ్లు ఇలా..

మునిసిపాల్టీ	డిమాండ్	వసూళ్లయిన మొత్తం	బకాయి	రాయితీ వల్ల వచ్చిన మొత్తం
భీమవరం	24.11 కోట్లు	21.75 కోట్లు	2.36 కోట్లు	2.96 కోట్లు
టీపీగూడెం	15.06 కోటు	11.52 కోట్లు	3.54 కోట్లు	2.00 కోట్లు
తణుకు	14.07 కోట్లు	13,59 కోట్లు	0.48 లక్షలు	2.09 కోట్లు
పాలకొల్లు	8.27 కోట్లు	7.58 కోట్లు	0.69 లక్షలు	1.52 కోట్లు
నరసాపురం	6.78 కోట్లు	5.55 కోట్లు	1.23 కోట్లు	0.85 లక్షలు
ఆకివీడు	3.13 కోట్లు	2.19 కోట్లు	0.94లక్షలు	0.34 లక్షలు
	71.96 కోట్లు	64.18 కోట్లు	9.24 కోట్లు	9.76 కోట్లు


తాడేపల్లిగూడెంలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రెండో విడత జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పెద తాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా పరీక్షలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండుపూటలా 180 మంది విద్యార్థులకు గాను, 176 మంది పరీక్షలు రాశారు. అదేవిధంగా శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 64 మందికి గాను 60 మంది, సాయంత్రం 57 మందికి గాను 57 మంది పరీక్షలు రాశారు.

భీమవరంలో 12 మంది గైర్హాజరు..

భీమవరంటౌన్ : భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు వంద మంది హాజరు కావలసి ఉండగా ఏడుగురు హాజరుకాలేదు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు వంద మందికి ఐదుగురు హాజరు కాలేదు. మొత్తం 12 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని పరీక్షల పర్యవేక్షణాధికారి సూర్యనారాయణ తెలిపారు.


భీమవరంలో నీటితో నిండిన ఎస్ఎస్ ట్యాంకు

ఎస్ఎస్ ట్యాంకులు నీటితో నింపండి

- వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పాండురంగారావు ఆదేశం

భీమవరంటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో పట్టణాల్లోని ప్రజలకు మంచినీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు ఇప్పటినుంచే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీటితో నింపుకోవాలని మునిసిపల్ అధికారులకు సూచిస్తూ పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.పాండురంగరావు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల మధ్యలోనే కాల్వలను ఇరిగేషన్ అధికారులు కట్టేసే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా నీటితో నింపుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కాల్వలకు అనుకుని ఉన్న పట్టణాలు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అవసరమైతే కాల్వలకు క్రాస్ బండ్‌లు వేసి నీటిని నిల్వచేసుకునేందుకు మునిసిపాల్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు పట్టణ ప్రజలకు రెండు పూటలా మంచినీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి కాల్వలు కట్టేస్తారని ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, బొలిశెట్టి శ్రీనివాస్ ఓ సమావేశంలో స్పష్టం చేశారు.

ఇప్పటికే ఎస్ఎస్ ట్యాంకుల్లో నీటి నిల్వలు

వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, నరసాపురం మునిసిపాల్టీలతో పాటు ఆకివీడు నగర పంచాయతీల్లోని ఎస్ఎస్ ట్యాంకుల్లో 95 శాతం ఇప్పటికే నింపామని పబ్లిక్ హెల్త్ డీఈ విజయ్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆకివీడుకు సంబంధించి 80 శాతం నింపారని వివరించారు. ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్నామ మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సమచారం ఇస్తున్నామన్నారు.

మునిసిపాలిటీల వారీగా వివరాలు..

- భీమవరం మునిసిపాల్టీకి రెండు ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయి. ప్రస్తుతం నిల్వ 1,211 ఎంఎల్ నీటి నిల్వలు ఉన్నాయి. దాదాపు 30 రోజులు వరకు వచ్చే అవకాశం ఉందని మరో పదిరోజుల కోసం జీవీ కెనాల్‌లో క్రాస్ బండ్ వేసి నీటిని నిల్వచేసి వినియోగించుకోవడం ద్వారా నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.
- తణుకు మునిసిపాల్టీకి సంబంధించి ఎస్ఎస్ ట్యాంకులు లేని కారణంగా అంతా బోర్ వాటర్‌పైనే ఆధారంకావడంతో ఇబ్బందులు ఉండవని అంచనావేస్తున్నారు.
- పాలకొల్లుకు ఉన్న ఎస్ఎస్ ట్యాంకు ద్వారా 30 రోజుల వరకు నీటిని సరఫరా చేసేందుకు అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరో పది రోజులకు నరసాపురం కాల్వలకు అడ్డుకట్టవేసి నీటి నిల్వ ద్వారా సరఫరా చేయవచ్చని అంచనావేస్తున్నారు.
- నరసాపురం మునిసిపాల్టీకి సంబంధించి ఎస్ఎస్ ట్యాంకు ద్వారా పూర్తిస్థాయిలో నీటిని అందించవచ్చని పబ్లిక్ హెల్త్ అధికారులు తెలిపారు.
- తాడేపల్లిగూడెం మునిసిపాల్టీకి 30 రోజులకు ఎస్ఎస్ ట్యాంకు ద్వారా అందించవచ్చని, మిగిగిన పది రోజులకు కాల్వకు అడ్డుకట్టవేసి తద్వారా నీటిని ప్రజలకు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశామని చెబుతున్నారు.
- ఆకివీడు నగర పంచాయతీకి సంబంధించి 80 శాతం నీటిని ట్యాంకుల్లో నింపామని, కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

- జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి


పాలకోడేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది శిక్షణలో పాల్గొన్న జేసీ

పాలకోడేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. పాలకోడేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, సిబ్బందికి ఉన్న అవగాహనపై సమీక్ష నిర్వహించామని, అదేవిధంగా మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ ధాన్యం కొనుగోలుకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సూచించారు. రైస్ మిల్లుల నుండి వచ్చిన గోనె సంచులను పరిశీలించి డ్యామేజ్ ఉన్న వాటిని తిరిగి పంపించి వేసేలా పీపీసీఎస్ సీఈవోలు ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. వచ్చేవారంలో పాలకోడేరు మండలానికి కేటాయించిన మూడు లక్షల గోనె సంచులను సంబంధిత రైతు సేవా కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవలసినదిగా తహసీల్దార్, ఎంఎల్‌వోలకు ఆదేశించారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి శ్రద్ధ వహించాలి

భీమవరంటౌన్ : పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జేసీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అధికారులతో సమావేశమై, డివిజన్, మండలస్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వెబ్ ఎక్స్ ద్వారా పీజీఆర్ఎస్ పిటీషన్ల పరిష్కారంపై శాఖల వారీగా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు అనిపిస్తుందని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు అన్నారు. కొన్ని శాఖల్లో ఫిర్యాదులు ఎక్కువ శాతం పెండింగ్ ఉన్నాయని వాటి పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్‌వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, డీపీవో కె.అరుణశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిప్పుతో ఆటలొద్దు!

వేసవిలో అగ్ని ప్రమాదాలకు అవకాశం

6

మాతృ మరణాలు ఉండకూడదు

- డీఎంహెచ్‌వో గీతాబాయి


సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

భీమవరంటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో మాతృ మరణాలు నమోదు కాకూడదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. జిల్లాలో మాతృ మరణాల నివారణ కార్యక్రమంలో భాగంగా అధికారులతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్చి-2025 నెలలో సంభవించిన మాతృ, శిశు మరణాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి వచ్చిన ప్రసూతి వైద్య నిపుణులతో మాతృ మరణాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భవిష్యత్తులో మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రైవేట్ యాజమాన్యమునకు. క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు అందించారు. సమా వేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ దేవసుధా లక్ష్మి, ఇతర ప్రసూతి వైద్య నిపుణులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ముస్లింల ర్యాలీ

ముస్లింల భారీ ర్యాలీ

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెడుతున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తాడేపల్లిగూడెంలో ముస్లింలు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు నుంచి ముస్లిం సోదరులు ప్లకార్డ్స్ పట్టుకుని వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ముస్లిం పెద్దలు సర్దార్ ఖాన్, నౌషద్ మొహిద్దీన్, మసీదు కమిటీ సెక్రటరీ ఎంఏ షాజహాన్, వలీ, బాషా పాల్గొన్నారు.



ధర్మం శరణం గచ్ఛామి !

పిల్లలతో యాచక వ్యాపారం

ధర్మం శరణం.. గచ్ఛామి.. దానం శరణం గచ్ఛామి.. అంతో.. ఇంతో ఇచ్చినవారికి ఇహమే స్వర్గం..లేదిక మరుజన్మం.. ఈ సినిమా పాటలోని సన్నివేశం ఎంత దయనీయంగా ఉంటుందో అంతే దయనీయ పరిస్థితి భీమవరంలోనూ కనిపిస్తుంది..గుడి, చర్చి, మసీదు ఇలా ఎక్కడైనా బిక్షగాళ్ల తాకిడి పెరిగిపోయింది. ఎంతోకొంత ఇచ్చేదాకా వదలరు.. వారితో పాటు చిన్న చిన్న పిల్లలను కూడా యాచక వృత్తిలోకి దింపేస్తున్నారు. చంటి పిల్లలతో అడిగితే డబ్బులు బాగా వస్తాయని కొంతమంది యాచకులు తమ పిల్లలను కూడా యాచకులుగా మారుస్తున్నారు. పిల్లలు లేనివారు అద్దెకు తెచ్చుకుని మరీ యాచన చేస్తున్నారని సమాచారం.. వారిపై చర్యలు తీసుకోవలసిన శాఖలు మౌనంగా ఉండడంతో భీమవరం పట్టణంలో రోజురోజుకు ఇలా భిక్షాటన చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది.



భీమవరం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటున్న చిన్నారులు..

-ఫొటోగ్రాఫర్, భీమవరం









బంటుమిల్లిలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటూ బొట్టుపెట్టి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

పిల్లలను ప్రభుత్వ బడులకు పంపండి

బంటుమిల్లిలో బొట్టుపెట్టి పిలిచిన ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు

పాలకోడేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : శృంగవృక్షం గ్రామపంచాయతీ పరిధిలో గల బంటుమిల్లి గ్రామంలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం వినూత్నంగా అక్షర పేరంటం అనే కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కమిటీ సభ్యులందరూ కలిసి గ్రామంలో కాన్వెంట్లు, ఇతర ప్రైవేట్ పాఠశాలల్లోకి వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అయిన పిల్లలు మంచిగా చదువుతున్నారని, పాఠశాలలో ఉన్న సౌకర్యాలను కరపత్రం ద్వారా వారికి తెలియజేసి బొట్టు పెట్టి తమ పాఠశాలలో చేర్పించవలసినదిగా ఆహ్వానించారు. అంతే కాకుండా ప్రైవేట్ స్కూళ్ళకు పిల్లలను బస్సులలో, ఆటోలలో ఉదయాన్నే పంపాల్సిన బాధలు లేకుండా మన ఊరి పాఠశాలలోనే అన్ని వసతులు, ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు, ఇంగ్లిష్ మీడియం బోధన, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్, మధ్యాహ్న బడిభోజనం, మినరల్ వాటర్, విశాలమైన తరగతి గదులు, పిల్లలందరికీ సరిపడా ఫర్నీచర్, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు, ఇంటర్నెట్ కనెక్షన్‌తో కూడిన స్మార్ట్ టీవీల ద్వారా విద్యా బోధన కార్పొరేట్ వసతులతో సమానంగా ఉన్నదని వివరించారు. మొదటి విడత ప్రచారంలో గ్రామ పెద్దలందరూ పాల్గొనగా రెండో విడతలో ఎస్ఎంసీ సభ్యులందరూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామానుజరావు, ఎస్ఎంసీ చైర్మన్ పాల లీలాకుమారి, వైస్ చైర్మన్ జంగం మనోహర్, ఎంపీటీసీ సభ్యులు మల్లుల సూర్య కళా శ్రీనివాసరావు, ఎస్ఎంసీ సభ్యులు కవురు సత్యధనలక్ష్మి, పాల సూర్యపాటి మహలక్ష్మి, పాల లక్ష్మీదుర్గ, కవురు దుర్గ, దొంగ హేమలత, కొయ్యే దేవమణి, హిందీ టీచర్ కవురు రాణి, కోడి వెంకట కనకలక్ష్మి, విప్పర్తి థామస్, పాల్గొన్నారు.



ఉగాది వేడుకల్లో ఆకట్టుకున్న నృత్యపోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఉగాది నాటక పోటీల్లో భాగంగా బుధవారం తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షించారు.



జోరుగా విసనకర్రల విక్రయాలు

ఫ్యాన్‌లు లేని సమయంలో వేడి నుంచి రక్షణకు ఇవే ఉపయోగపడేవి.. కరెంటు పోతే వెంటనే చేతిలోకి విసనకర్ర వచ్చేది.. ప్రస్తుతం వీటికి సీజన్ రావడంతో మార్కెట్‌లో విరివిరిగా అమ్మకాలు సాగుతున్నాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తణుకు ప్రధాన రహదారుల వెంబడి విసనకర్రలు విక్రయిస్తున్నారు. కాలం మారినా విసన కర్రలకు మాత్రం డిమాండ్ తగ్గలేదు. వేసవి కావడంతో పలువురు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్కటి 60 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నారు.

-తణుకు (ఆంధ్రజ్యోతి)

నిప్పుతో ఆటలొద్దు !

వేసవిలో అగ్ని ప్రమాదాలకు అవకాశం

ముందు జాగ్రత్తలతో దూరం

గ్యాస్, విద్యుత్, బాణసంచాల పట్ల అప్రమత్తత అవసరం



గతేడాది శ్రీరామనవమి వేడుకల్లో బాణసంచా పడి దువ్వ వేణుగోపాలస్వామి ఆలయంలో అగ్నిప్రమాదం (ఫైల్)

నిడమర్రు ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నిప్పుతో చెలగాటం వద్దంటారు పెద్దలు. నిర్లక్ష్యం చేస్తే అది మన ఆస్తుల్ని, నివాసాల్ని, చివరకు మనల్ని కూడా దహించివేస్తుంది. వేసవి కాలం..ఎండలు మండుతున్న వేళ అగ్ని ప్రమాదాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తతో ఉండడం ద్వారా క్షేమంగా, సురక్షితంగా ఉండవచ్చు. మిగతా కాలాలతో పోలిస్తే వేసవికాలం అగ్ని ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది.

గడ్డివాములతో జాగ్రత్త

వేసవిలో గడ్డివాముల ఎక్కువగా అగ్నికి ఆహుతవుతుంటాయి. గడ్డి తోలుకొని వెళ్లే ట్రాక్టర్లు, లారీలు తమ రవాణాలో విద్యుత్ తీగలు కింద నుంచి వెళ్లేసమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలి. అలాగే గడ్డివాములు నిల్వ చేసే ప్రదేశం విద్యుత్ తీగలకు 15 మీటర్లు దూరంలో ఉండాలి. గడ్డివాములను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. కుర్రాళ్లు బీడీ, సిగరెట్లు చాటుగా తాగుతూ గడ్డివాముల వద్ద వదలివేస్తుంటారు.



గ్యాస్ సిలెండర్లు

వేసవి అగ్ని ప్రమాదాల్లో రెండోస్థానం గ్యాస్ సిలెండర్ ప్రమాదాలే ఎక్కువ. గ్యాస్ సిలెండర్లను వాడే సమయంలో రెగ్యులేటర్ సరిగా కట్టక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే రెగ్యులేటర్ నుంచి గ్యాస్ పొయ్యికి వచ్చే రబ్బరు పైప్‌ను ఎప్పటికప్పుడు చూసుకొంటూ ఉండాలి. అవసరమైతే కొత్తది వేసుకోవాలి. వేసవిలో ఊర్లు వెళ్లే సమయంలో రెగ్యులేటర్ కనెక్షన్ తొలగించి గ్యాస్ బండ్‌కు బిరడా మూతి బిగించాలి.

పాత వైరింగ్‌తో షార్ట్‌సర్క్యూట్ సమస్యలు

వేసవిలోనే కాదు అనునిత్యం అగ్ని ప్రమాదాలు సంభవించే ఏకైక అవకాశం విద్యుత్ వైర్లు ద్వారా జరుగుతుంది. వేసవిలో లోటల్టేజ్, హైటల్టేజ్ సమస్యల వల్ల నాసిరకం విద్యుత్ వైర్లు కాలిపోయి మొత్తం ఇంటిని అగ్నికి ఆహుతి చేస్తుంది. ఇటీవల పరిమెళ్ల గ్రామంలో పాత వైరింగ్ వల్ల షార్టు సర్క్యూట్ జరిగి ఇల్లంతా బూడిదైంది. అలాగే పెట్రోలు బంకుల వద్ద కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు. పెట్రోలు కొట్టించుకొనే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడకుండా ఉండడం మంచిది.

> ఏలూరు జిల్లాలో 7 ఫైర్ స్టేషన్లు ఉండగా 8 అగ్ని మాపక వాహనాలు పనిచేస్తున్నాయి. 98 మంది సిబ్బంది ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 7 ఫైర్ స్టేషన్లు ఉండగా 7 వాహనాలు పనిచేస్తున్నాయి. ఇక్కడ 96 మంది సిబ్బంది విధుల్లో ఉంటున్నారు.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

- పూరి గుడిసెలలో పొయ్యి వెలిగించి బొగ్గులను పూర్తిగా ఆర్పకుండా చెత్తకుప్పలలో వేయడం వల్ల మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. వీటిని నివారించాలి.
- మహిళలు వంట,వార్పు అయిన తర్వాత తప్పనిసరిగా గ్యాస్ స్టవ్ రెగ్యులేటర్, బర్నర్‌లను కట్టివేయాలి. గ్యాస్ సిలెండర్ పరిస్థితి ఆరునెలలకోసారి పరీక్షించుకోవాలి.
- పురాతన ఇళ్లలో ఉపయోగించిన నాసిరకం విద్యుత్ వైర్ల వల్ల, డ్యామేజీల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించడం ఇటీవల ఎక్కువగా చూస్తూనే ఉన్నాం. పాతవి, డ్యామేజీ అయిన విద్యుత్ వైర్లు ఎప్పటికప్పుడు తొలగించాలి.
- ఇటీవల కాలంలో మ్యారేజ్ ఫంక్షన్లు, రాజకీయ సమావేశాల్లో, జాతర ఉత్సవాల్లో మందుగుండు సామాగ్రి పేల్చుతున్నారు. అవి అదుపుతప్పి ఒక్కోసారి ఇళ్లు, గడ్డివాములపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తత అవసరం
- పట్టణాలలో పెద్ద ఫ్యాక్టరీలలో, దీర్ఘకాలం వాడిన పరికరాల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయించుకోవాలి.
- అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 101కి సమాచారం ఇవ్వాలి. స్టేట్ ఫైర్ కంట్రోల్ రూమ్ 91001 08101 నంబర్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చును.

జాగ్రత్తలతోనే ప్రమాదాలకు దూరం



ఏలూరు జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఆరు అగ్నిమాపక కేంద్రాలతో పాటు కుక్కునూరులో తాత్కాలికంగా 7వ కేంద్రం ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదం వల్లే జరుగుతుంటాయి. అందువల్ల మహిళలు వంట చేసే సమయంలో పూర్తి జాగ్రత్తతో వ్యవహరించాలి. పురాతన భవనాలలో కాలం చెల్లిన విద్యుత్ వైర్లు, పరికరాలు తొలగించి ఐఎస్ఐ మార్కు కలిగిన నూతన విద్యుత్ పరికరాలు అమర్చుకోవాలి. వేడుకల సమయంలో మందుగుండు సామాగ్రి పేల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

-సీహెచ్ రత్నబాబు , జిల్లా అగ్నిమాపక అధికారి ఏలూరు

తూర్పు యడవల్లిలో వసంత నవరాత్రి ఉత్సవాలు

కామవరపుకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చిన్న భద్రాద్రిగా పేరొందిన ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత ఆలయమైన కామవరపుకోట మండలం తూర్పుయడవల్లి సీతారామాలయంలో వసంత నవరాత్రి శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం తొళక్కం వాహనంపై సీతారామలక్ష్మణ హనుమంతుల వారిని అలంకరించి గ్రామంలో మేళతాళాలు, బాజా భజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహించారు. వీధివీధిన స్వామి వారికి భక్తులు హాజరుతులు ఇచ్చారు. 6వ తేదీన సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు.



తొళక్కం వాహనంపై సీతారాములు

బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

భీమవరం క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, పేకాట, బెట్టింగ్‌లు వంటివి నిర్వహించినా సంఘ విద్రోహులుగా నిర్ధారించి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ అన్నారు. ఇటీవల భీమవరం పట్టణంలోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతుండగా కొంత మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద భారీగా సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. దీంతో వాటిపై దృష్టి పెట్టారు. హోటళ్ళు, లాడ్జిల యజమానులకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఎవరైనా గుర్తింపు కార్డు లేకుండా వస్తే రూమ్‌లు ఇవ్వవద్దని, అలాగే రూమ్‌లు తీసుకున్న వారిపై నిఘా ఉంచాలని సూచించారు. ప్రత్యేక నిఘా విభాగం ఈ బెట్టింగ్ యాప్‌ల పనితీరుపై పరిశీలిస్తుంటుందని, బెట్టింగ్‌లు ఆడేవారి నెంబర్లను పర్యవేక్షణలో ఉంచుతున్నామన్నారు.

స్కూళ్లల్లో దాహం కేకలు

ఉంగుటూరు ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు అంటూ హడావుడి చేసి ఒక్కో పాఠశాలలో లక్షలాది రూపాయిలు వెచ్చించిన తాగునీటి పథకాలు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఉంగుటూరు మండలంలోని ఉంగుటూరు, నారాయణపురం, కైకరం హైస్కూళ్లలో నాడు-నేడు పథకంలో సుమారు రూ.5 లక్షలతో నిర్మించిన తాగునీటి పథకాలు పనికి రాకుండా పోయాయి. దీంతో విద్యార్థులు పలు పాఠశాలల్లో దాతలు అందించిన లేదా ఇంటి నుంచి , చుట్టుపక్కల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఎండలు మండిపోతున్న ఈ సమయంలో విద్యార్థులకు తగిన విధంగా తాగునీరు సరఫరా కాకపోవడంపై పిల్లల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరులో రైల్వే గేటు అవతల హైస్కూలు ఉండడం ఆ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య కారణంగా మోటార్ పనిచేయకపోవడంతో నీటికి సమస్య ఏర్పడింది. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చొరవతో అప్పటికప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయినా హైస్కూలులో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. పాఠశాలలో విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేసినా విద్యార్థులకు తగిన విధంగా తాగునీరు సరఫరా కావడం లేదని తల్లిదండ్రుల కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. కైకరం, నారాయణపురం, రాచూరు హైస్కూళ్లలో ప్రభుత్వం నీటి గంటలను సమయానుకూలంగా నిర్వహించడం లేదని వీటి నిర్వహణ అంతంత మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉంగుటూరు స్కూల్‌లో ఉపయోగం లేని వాటర్‌ప్లాంట్



కైకరంలో నీరు రాని ట్యాప్‌లు







చెట్టు చెట్టుకూ ఓ సందేశం..

కొమ్మ కొమ్మకో సన్నాయి...కోటి రాగాలు ఉన్నాయి..అంటూ ఒక సినిమా పాటలో రాసినట్లుగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ప్రతీ చెట్టు ఓ సందేశాన్ని ఇస్తున్నాయి. కళాశాల తరగతి గదిలోని నల్ల బోర్డులే కాకుండా ఆరుబయట చెట్లు కూడా విద్యార్థులకు, సందర్శకులకు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఆవరణలోని చెట్లపై వివిధ అంశాలకు చెందిన చిత్రాలను చిత్రీకరించారు. వీటిలో పర్యావరణం, మొక్కల పెంపకం, పరిసరాల పరిరక్షణ, నీటి సంరక్షణ, వంటి అంశాలతో పాటు భోదిసత్వుడు, పక్షులు, వంటి అంశాలకు సంబంధించిన చిత్రాలను ఆయిల్ పెయింట్‌తో ఆకర్షణీయంగా చిత్రీకరించారు. దీంతో కళాశాలలో ప్రవేశించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు, ఇతర సందర్శకులకు కళాశాల ఆవరణ ఆహ్లాదకరంగా, వినోదభరితంగా చూడముచ్చటగా వుంది.

- తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి)









పెరిగిన టోల్‌ప్లాజా చార్జీలు

పెదపాడు/ఉంగుటూరు ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై వున్న టోల్‌ప్లాజాల వద్ద వాహనాల ప్రవేశ రుసుం పెంచింది. దీనిపై వాహనదారులు గగ్గోలుపెడుతున్నారు. కొత్తరేట్ల ప్రకారం ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వచ్చాయి.

	కలపర్రు టోల్‌ప్లాజా		ఉంగుటూరు టోల్‌ప్లాజా	
వాహనం	పాత రేట్లు	పెరిగిన రేట్లు	పాత రేట్లు	పెరిగిన రేట్లు
కారు/జీపు/వ్యాను	70	75	110	115
లైట్ కమర్షియల్	115	120	180	190
బస్/ట్రక్	240	245	380	395
త్రీ యాక్సిల్ కమర్షియల్ వాహనం	260	270	415	430
ఫోర్ టు సిక్స్ యాక్సిల్ వాహనం	375	390	595	615
ఓవర్ సైజ్ వాహనం	455	470	725	750



మొగల్తూరులో డంప్ చేసిన చెత్తను టిప్పర్‌లో లోడు చేస్తున్న జేసీబీ

క్లీన్ మొగల్తూరు కార్యాచరణ ప్రారంభం

మొగల్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో చేపట్టిన క్లీన్ మొగల్తూరు కార్యాచరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నెల 1న మండల స్థాయి అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ పేషీ నుంచి చెత్త సమస్య పరిష్కారం చూపుతూ కార్యాచరణ రూపొందించాలని వచ్చిన ఆదేశాలు 24 గంటలు గడవక ముందే మొగల్తూరులో డంప్ చేసిన చెత్తను ప్రత్యేక టిప్పర్ లారీలతో నరసాపురం తరలింపు పనులు బుధవారం చేపట్టారు. మొగల్తూరులో డంపింగ్‌యార్డ్ లేక రహదారి, చెరువుల వెంబడి డంప్ చేసిన చెత్త సమస్యను పరిష్కరించాలని గత నెల 28న గ్రామాభివృద్ధి సభలో రైతు కొత్తపల్లి చిరంజీవి రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ సమస్యను కృష్ణ తేజ స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సమస్య పరిష్కరించాలని సూచించడంతో బుధవారం రెండు భారీ టిప్పరు లారీలను స్వచ్ఛాంధ్ర పథకం నుంచి మొగల్తూరు పంపించి నరసాపురం తరలింపు పనులు చేపట్టారు. ముందుగా ఈ చెత్తను విశాఖకు తరలించాలని ప్రణాళిక రూపొందించగా భారీ ఖర్చు కావడంతో నరసాపురం తరలించాలని యోచించారు. దీంతో మొగల్తూరులో గల డంప్ చేసిన చెత్తను పూర్తి స్థాయిలో గురువారం నుంచి మరిన్ని ఎక్కువ టిప్పర్ లారీలు వినియోగించి తరలించేలా ఏర్పాట్లు చేశారు. నరసాపురంలో ఈ చెత్తను ఐదు కేటగిరీలుగా వేరు చేసి స్వచ్ఛ ఆంధ్ర సిబ్బంది వినియోగంలోకి తీసుకువస్తారని స్వచ్ఛ ఆంధ్ర సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాస్, బి.వెంకటేశ్ తెలిపారు.

టెన్షన్.. టెన్షన్

జిల్లా మదుపుదారుల్లో ట్రంప్ సుంకాల భయం

ఇప్పటికే భారీగా నష్టపోయిన ఇన్వెస్టర్లు

ప్రతీకార సుంకాలు విధిస్తే నేడు ఇండెక్స్ భారీ పతనం !



నరసాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):స్టాక్ మార్కెట్ మదుపుదారుల్లో ట్రంప్ విధించే సుంకాల టెన్షన్ నెలకొంది. ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తరువాత మార్కెట్ భారీగా పతనమైంది. చాలామంది ఇన్వెస్టర్లు నష్టాలను మూటగట్టుకున్నారు. కొద్ది రోజుల నుంచి ట్రంప్ భారత్‌పై ప్రతికార సుంకాలు తప్పవని హెచ్చరించడంతో స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడిదుకులకు లోనవుతూ వస్తున్నది. మంగళవారం భారీ పతనాన్ని నమోదు చేసుకుంది. బుధవారం మార్కెట్‌లో కొద్దిగా రికవరీ ఉన్నప్పటికీ గురువారం సుంకాల ప్రభావంతో ఇండెక్స్ ఎలాంటి పతనాన్ని నమోదు చేసుకుంటుందోనన్న భయం మదుపుదారులను వెంటాడుతోంది. ఆమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారంలోకి వస్తే స్టాక్ మార్కెట్ దూసుకుపోతుందని జిల్లాలోని ఇన్వెస్టర్లు భావించారు. అయితే ట్రంప్ గెలిచిన దగ్గర నుంచి ప్రతీకార సుంకాల గురించే మాట్లాడుతుండటంతో మార్కెట్ భారీగా పతనమవుతూ వస్తున్నది. ఇటీవల కొద్దిగా రికవరీ అయినా ట్రంప్ భయం మాత్రం వీడలేదు, ఇతర దేశాలపై విధించిన మాదిరిగానే భారత్‌పైన పన్నులు వేస్తే మళ్లీ మార్కెట్‌లో పతనం తప్పదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో చాలామంది మదుపుదారులు ఉన్న పెట్టుబడుల్ని తగ్గించుకున్నారు. కొందరు నష్టాలకు అమ్ముకోలేక కొన్న స్టాక్‌ను ఉంచేశారు. అయితే నేటి మార్కెట్ మరో బ్లాక్ డేను నమోదు చేసుకుంటుందా? లేక తటస్థంగా ఉంటుందా? అన్నది చర్చనీయాంశమైంది. రాష్ట్రంలోని పశ్చిమ స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు పెట్టింది పేరు. బ్యాంకుల్లో వడ్డీ రేట్ల తగ్గడం, రియల్ ఎస్టేట్ పడిపోవడంతో చాలా మంది మదుపుదారులు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ వచ్చారు. అయితే సెప్టెంబరు నుంచి మార్కెట్‌లో సూచిక రెడ్‌మార్క్‌లోనే క్లోజ్ అవుతూ వస్తుంది. ఈ కారణంగా కోట్లల్లో నష్టపోయారు. వీటి నుంచి గట్టెక్కుతామని ఆశతో ఎదురుచూసిన మదుపుదారులకు ట్రంప్ సుంకాల హెచ్చరికలు ఆశలపై నీళ్లు జల్లినట్లయింది.



మెప్మా అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

స్వయం సహాయక ఉత్పత్తుల అమ్మకాల్లో రికార్డు

భీమవరం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 1.5 లక్షల స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫారమ్ ద్వారా అమ్మి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం అభినందనీయమని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరంలోని కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్‌ని మెప్మా అధికారులు కలిసి గిన్నిస్ బుక్ రికార్డ్స్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ఓఎన్‌డీసీ వేదికగా ఒకేరోజు 1.50 లక్షల ఆర్డర్లను పొందినందుకు గుర్తింపుగా గిన్నిస్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారని, దీనిలో జిల్లా నుంచి 6,500 ఎస్‌హెచ్‌జీల భాగస్వామ్యం ఉందని మెప్మా అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓఎన్‌డీసీ అమ్మకాలలో జిల్లా భాగస్వామ్యం పెద్ద మొత్తంలో పెరగాలని సూచించారు. మెప్మా జిల్లా లైవ్లీహుడ్స్ స్పెషలిస్ట్ సీహెచ్ నాని బాబు, జిల్లా ఐబి గ్రంధి పార్వతి, జిల్లా ఈ మార్కెట్ స్పెషలిస్ట్ సీహెచ్ మోహన్ వున్నారు.

భద్రాచలానికి పాదయాత్రగా భక్తులు

టి.నరసాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణం తిలకించి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాదయాత్రగా తరలివెళ్లారు. మండలంలోని టి.నరసాపురం, మక్కినవారిగూడెం, తిరుమల దేవిపేట, మధ్యాహ్నపువారిగూడెం, వల్లంపట్ల, మల్లుకుంట, బొర్రంపాలెం, అప్పలరాజుగూడెం నుంచి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యలో భక్తులకు తాగునీరు, అల్పాహారం, భోజన వసతులు కల్పించారు. సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. అప్పలరాజుగూడెం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి పాదయాత్రను ప్రారంభించారు.



అప్పలరాజుగూడెం ఆంజనేయస్వామి విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు



వెంకటాపురంలో వరి సాగును పరిశీలిస్తున్న కేరళ రైతు బృందం

ప్రకృతి సాగుతో ప్రజారోగ్యం

సాగు విధానాన్ని పరిశీలించిన కేరళ రైతుల బృందం

పెదవేగి/ఏలూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రకృతి విధానంలో సాగయ్యే పంట ఉత్పత్తులు దోహదపడతాయని ప్రకృతి సాగు రైతు ఉప్పలపాటి చక్రపాణి అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో ప్రకృతి విధానంలో సాగుచేస్తున్న పంటలను కేరళ రైతుల బృందం బుధవారం పరిశీలించి, పంటల సాగులో రైతులు చేపడుతున్న విధానాలు, యాజమాన్య పద్ధతులను తెలుసుకున్నారు. చక్రపాణి తోటలో ప్రకృతి విధానంలో సాగవుతున్న కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతరంగా పండిస్తున్న వక్క, మిరియం పంటలను పరిశీలించారు. ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా పంటలను సాగుచేస్తున్న విధానాన్ని నేరుగా చూపించారు. నాణ్యమైన పంటల దిగుబడితోపాటు ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ఈ విధానం దోహదపడుతుందని చక్రపాణి తెలిపారు. కేరళ రైతుల బృందం తొలుత వెంకటాపురం గ్రామంలో దేశీ విత్తనాలతో 16 ఎకరాల్లో సాగుచేసిన ఏ గ్రేడ్ వరి కాంపాక్ట్ బ్లాక్‌ను పరిశీలించారు. ప్రకృతి విధానంలో పొలం గట్లమీద వేసిన పంటలను గమనించిన బృందం రసాయనిక ఎరువులతో సాగుచేసిన పంటలను పరిశీలించి, రెండింటి మధ్య వ్యత్యాసాలను గమనించారు. జీవ ఉత్ప్రే రకాలు, కషాయాల తయారీ విధానాన్ని తిలకించి, ఎన్‌పీఎమ్ దుకాణాన్ని సందర్శించారు. అమ్మపాలెంలో ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న రైతులు, మెంటార్‌లు, రైతు శాస్త్రవేత్తలతో పరస్పరం చర్చించారు. రైతులు రంగయ్య, సత్తిబాబులకు చెందిన ఐదు అంతస్థుల నమూనా, కొబ్బరి ఏ గ్రేడ్ మోడల్‌పంటలను కేరళ రైతుల బృందం సందర్శించింది. రైతు సాధికార సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డీపీఎం తాతారావు, అదనపు డీపీఎం వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి సంధ్య, రైతులు పాల్గొన్నారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కషాయాల తయారీపై వ్యవసాయ శాఖాధికారులు వివరించారు. 16 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన వరి పంటను సందర్శించారు.



కొబ్బరి సాగు వివరాలను చెప్తున్న రైతు చక్రపాణి

పిల్లలు నిలదీశారని తండ్రి ఆత్మహత్య



కొండయ్య

ముదినేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగుతూ రోజూ అర్ధరాత్రి ఇంటికి రావడాన్ని కన్నబిడ్డలు నిలదీయడంతో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముదినేపల్లి మండలం వడాలిలో జరిగింది. జానకిగూడెంకు చెందిన పిచ్చేటి కొండయ్య(42)కు వడాలికి చెందిన గంగావేణితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి 9వ తరగతి చదివే కుమారుడు, ఏడో తరగతి చదివే అమ్మాయి ఉంది. ఏడాది క్రితం భార్య సౌదీ వెళ్లి పనిచేస్తోంది. అప్పటి నుంచి కొండయ్య తన ఇద్దరు పిల్లలతో వడాలిలోని అత్తవారింట్లో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కొండయ్య మద్యానికి బానిసగా మారి రోజూ మద్యం మత్తులో ఇంటికి వస్తున్నాడు. విసుగు చెందిన పిల్లలు తండ్రిని మందలించారు. మనస్థాపం చెందిన కొండయ్య మూడ్రోజుల క్రితం ఎలుకల మందు తినడంతో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ వి.ఎస్.వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని కొడుకు..

పెదవేగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):పనిచేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడని, తల్లి మందలించడంతో మనస్థాపానికి గురై ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దాసరి ఉపేంద్ర పని చేయకుండా ఖాళీగా తిరుగుతు న్నాడు. ఎంతకాలం ఇలా తిరుగుతావని తల్లి మందలించడంతో పురుగు మందు తాగి ఉపేంద్ర(27) ఆత్మహత్య చేసుకున్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఒకరిది ఆర్థిక.. మరొకరిది అనారోగ్య సమస్యలతో..

పెదపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం తోటగూడెం, సకలకొత్తపల్లి గ్రామాల్లో గడ్డి మందు తాగి ఇద్దరు మృతి చెందడంతో పెదపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తోటగూడెం గ్రామానికి చెందిన నార్ని సాంబశివరావు(42) ఆర్థిక ఇబ్బందులతో పాటుగా ఫిట్స్ ఉండటంతో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

సకలకొత్తపల్లికి చెందిన సాకేటి సూర్యారావు (52) సెంట్రింగ్ సామన్లు అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్య సమస్యతో గడ్డిమందు తాగినట్టు భార్య నళినికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరుచోట్ల మరో ఇద్దరు బలవన్మరణం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):వేర్వేరు ఘటనల్లో పురుగు మందు తాగిన ఇద్దరు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన దాసరి ఉపేంద్ర (27) ఈ నెల 1న పురుగు మందు తాగడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. పెనుగొండ మండలం గుడిపాడు గ్రామానికి చెందిన నేదునూరు లాజర్(52) ఈ నెల 1న పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీరిద్దరి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

వేసవిలో పర్యాటకులకు ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా పర్యాటకుల కోసం ప్రత్యేక టూరిస్టు రైలును నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర ఈ నెల 8న ప్రారంభమై 19వ తేదీ వరకు జరుగుతుంది. ఉజ్జయినీ (మహాకాళేశ్వర్, ఓం కారేశ్వర్) ద్వారక(నాగేశ్వర్), సోమనాథ్, పూణే(భీమశంకర్), నాసిక్ (త్రియంబకేశ్వర్),ఔరంగాబాద్(గ్రీష్మేశ్వర్)లలో యాత్రలలో పుణ్య క్షేత్రాలను చూపించనున్నారు. ఒకొక్కరికీ 18వేల 510 రూపాయల ప్యాకేజీ ధర అన్నారు. హరిద్వార్, రిషికేష్, వైష్ణవిదేవి యాత్ర ఈ నెల 23 నుంచి మే 2వ తేదీ వరకు 9 రాత్రిళ్లు 10 పగళ్లు జరుగుతాయి. ఈ యాత్రలో హరిద్వార్, రిషికేష్, ఆనందపూర్, నయనాదేవి, అమృతసర్, మాతా వైష్ణవ్‌దేవి ఆలయాల సందర్శన ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ ద్వారా 18వేల 510 రూపాయలు ఒకొక్కరికి ధర ఉంటుందన్నారు. కాశీ, గయ, ప్రయోగ్, అయోధ్య యాత్ర (సరస్వతి పుష్కరాలు స్పెషల్ యాత్ర) మే 8వ తేదీ నుంచి మే 17వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయోగరాజ్‌లలోని దేవాలయాల దర్శనాలు ఉంటాయన్నారు. ఒకొక్కరికి 16వేల 800 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంచ జ్యోతిర్లింగ యాత్ర జూన్ 4 నుంచి జూన్ 12 వరకూ నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మహాకాళేశ్వర్, ఓం కారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమ్‌శంకర్, గ్రీష్మేశ్వర్, ఎల్లోరా, మౌ, నాగపూర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో దర్శనాలు ఉంటాయన్నారు. ఒకొక్కరికి 14 వేల 700 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీలలో ప్రత్యేక రైలు, బస్సు, హోటల్, భోజనం, సైడ్ సీయింగ్, గైడు సేవలు వంటివి కలిపే వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ యాత్రకు వెళ్లాలనుకున్న వారు ఐఆర్‌టీసీ ఏరియా ఆఫీస్, విజయవాడ రైల్వే స్టేషన్ సెల్ నెంబర్ 92814 95848 లేదా 92810 30714 లో సంప్రదించాలని తెలిపారు.

చర్లపల్లి నుంచి విశాఖకు మరొకటి..

వేసవి దృష్ట్యా ప్రయాణికుల రద్దీని గుర్తించి ఈ నెల 3న రాత్రి 10.15 నిమిషాలకు చర్లపల్లిలో ప్రత్యేక రైలు (రైల్‌నెంబర్ 07011) బయల్దేరనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడిపూడి, పిడుగురాళ్ల, సత్తెన పల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగనుంది. ఈ రైలులో సెకండ్ క్లాస్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ రైలు నాల్గోవ తేదీ ఉదయం 9.30 గంటలకు విశాఖ చేరుతుందన్నారు.

భర్త అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

హత్య చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు



శ్మశాన వాటిక వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : తన భర్తను భర్త తరపు బంధువులే చంపేశారంటూ తాడేపల్లిగూడెంలోని కొబ్బరితోట హిందూ శ్మశాన వాటిక వద్ద బుధవారం భార్య ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శ్మశాన వాటిక వద్ద దహన సంస్కారాలను ఆమె అడ్డుకుంది. తాడేపల్లిగూడేనికి చెందిన కలగాని సతీశ్ బాబు మృతి చెందడంతో బంధువులు శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. దీంతో భార్య స్వాతి తన భర్త మృతిపై అనుమానాలున్నాయంటూ దహన సంస్కారాలను అడ్డుకుంది. దీనిపై పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ. బాదం శ్రీను ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బాధితురాలు స్వాతి ఫిర్యాదుతో మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.సతీశ్ బాబు సోదరుడు శ్రీనివాస్ కలగజేసుకుని తన తమ్ముడు లివర్, కిడ్నీలు ఫెయిల్ అవడంతో చాలా కాలంగా చికిత్స చేయిస్తున్నామని, బుధవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని తెలిపారు.

ఉంగుటూరులో హత్యాయత్నం కేసు నమోదు

ఉంగుటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):ఉంగుటూరులో మంగళవారం రాత్రి మార్లపూడి ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన యర్రారపు రాజు పదునైన ఆయుధంతో దాడి చేశాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం బుధవారం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివాహేతర సంబంధమే ఈ ఘర్షణకు కారణమని తెలిసింది. గతంలో ఈ వ్యవహారంపై పెద్దల మధ్య రాజీ కుదిర్చారు. ఈ విషయమై మరోసారి ఘర్షణ జరిగినట్టు చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ప్రసాద్ ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

ఇసుక ర్యాంపు దగ్గర వివాదం

పెదవేగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):తమ్మిలేరు ఇసుక ర్యాంపు దగ్గర జరిగిన వివాదంలో ఒకరు గాయపడ్డాడు. పినకడిమికి చెందిన అబ్బూరి మహేశ్ మార్చి 29న తమ్మిలేరులో ఇసుక ర్యాం పులో పనికి వెళ్లాడు. నాగార్జున, నత్తా అజయ్ లు మహేశ్‌కు చెందిన పారలతో పనిచేస్తున్నా రు. వాటిని తిరిగి ఇవ్వమన్నందుకు అడిగిన మహేశ్‌పై నాగార్జున, అజయ్‌లు దాడి చేశారు. గాయపడ్డ మహేష్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

పాత కక్షలతో ఒకరిపై మరొకరు దాడి

ఏలూరు క్రైం : ఇద్దరు డ్రైవర్ల మధ్య పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన గుడిపూడి ప్రకాశ్, చవాకుల సుధీర్ కుమార్‌లు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ సుధీర్‌కుమార్, ప్రకాశ్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నావని అడిగాడు. తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పడంతో సుధీర్ అతని ఇంటికి వెళ్లి దాడి చేశాడు. ప్రకాశ్ కూడా తిరిగి దాడి చేశాడు. దీంతో వీరిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

డ్రైన్‌లో మనిషి పుర్రె కలకలం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని పాతూరులో డ్రైనేజీలో మనిషిపుర్రె కలకలం రేగింది. మున్సిపల్ సిబ్బంది సోమవారం డ్రైయిన్ పూడిక తీస్తుండగా మనిషి పుర్రె బయట పడింది. దీంతో సిబ్బంది ఆ పుర్రెను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. స్థానికులు ఆ విషయాన్ని వైరల్ చేయడంతో పోలీసులు బుధవారం ఆ ప్రాంతాన్ని పరి శీలించగా అక్కడ ఏమీ కనిపించలేదు. డ్రైనేజీ మట్టి తరలించిన డం పింగ్ యార్డుకు వెళ్లి వెతికినా ఆ పుర్రె కనిపించలేదు. స్థానికంగా క్రైస్తవ శ్మశాన వాటిక ఉండటంతో.. అక్కడ ఖననం చేసిన వారి పుర్రె డ్రైన్‌లో లభించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా టీచర్ల సీనియార్టీ జాబితా విడుదల

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించి సవరించిన తాత్కాలిక సీనియార్టీ జాబితాలను డీఈవో వెంకట లక్ష్మమ్మ బుధవారం విడుదల చేశారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా ఇప్పటికే రెండుదఫాలు రూపొందించిన సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించిన అనంతరం తాజాగా సవరణలతో కూడిన జాబితాలను మరోదఫా విడుదల చేశారు. ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులకు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులకు సీనియార్టీ జాబితాలను తయారు చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈ జాబితాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో, పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖ కార్యాలయ(ఏలూరు) నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని డీఈవో వివరించారు. ఈ జాబితాలపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 9వ తేదీలోగా సరైన ఆధారాలతో ఏలూరులోని డీఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సీనియార్టీ జాబితాలో తప్పిదం ఎక్కడుందో స్పష్టంగా తెలియజేయడంతో పాటు, సంబంధిత ఆధారాలు, అభ్యంతరం వ్యక్తం చేసే ఉపాధ్యాయుని పూర్తి వివరాలతో మాత్రమే తెలియజేయాలని కోరారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుదినిర్ణయం తీసుకుని, సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11,386 మంది ఉపాధ్యాయులు /హెచ్‌ఎంలు పనిచేస్తుండగా, వీరిలో 5532 మంది స్కూల్ అసిస్టెంట్లు, 4800మంది ఎస్జీటీలు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు 350మంది, మరికొందరు ఇతర కేడర్ల టీచర్లు ఉన్న విషయం విదితమే.

ఉగాది పండుగకు ఇంటికొచ్చి.. తిరిగిరాని లోకాలకు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగకు ఇంటికొచ్చిన కొడుకు తిరిగిరాని లోకానికి వెళ్లిపోవడంతో ఆ తండ్రి కన్నీరు మున్నీరయ్యాడు. చేతికొచ్చిన కొడుకు ఇలా నిర్జీవంగా మారడంతో గుండెలవిసేలా రోధిస్తున్నారు. నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన కట్టా నవరత్నం(25) హైద్రాబాద్‌లో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఉగాది పండుగకు కుటుంబ సభ్యులతో గడుపుదామని ఇంటికి వచ్చాడు. పండుగ అయిపోవడంతో బుధవారం తిరిగి హైద్రాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో నరసాపురం- పాలకొల్లు జాతీయ రహదారి వద్ద చిట్టవరం సమీపంలో రోడ్డు పక్కకు ఆగి ఉన్న బైక్‌ను నరసాపురం నుంచి పాలకొల్లు వెళ్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నవరత్నం తీవ్రంగా గాయపడగా వెంటనే ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్టు నిర్ధారించారు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలవడంతో ప్రైవేట్ అస్పత్రికి తరలించారు.. తండ్రి పెద్దిరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్.ఐ. వెంకట సురేశ్ తెలిపారు.

కాల్వలో ట్రాక్టర్ బోల్తా



ఆచంట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ఆచంట మండలం కోడేరు బ్యాంక్ కెనాల్‌లో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కోడేరు రేవు వద్ద లాకుల సమీపంలో ఏటిగట్టు వద్ద కొన్నేళ్ల నుంచి నిద్రగన్నేరు చెట్టు కెనాల్ లాకుకు ఇబ్బందిగా ఉండటంతో ఈ చెట్టును బుధవారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. అయితే తొలగించిన కొమ్మలు వాటిని ట్రాక్టర్ సాయంతో తీసుకెళ్లే సమయంలో వంతెనపై వస్తుండగా ప్రమాదవశాత్తు కర్రల లోడుతో ఉన్న ట్రాక్టర్ బ్యాంక్ కెనాల్లోకి పడిపోయింది. దీంతో స్థానికులు వెంటనే స్పందించి డ్రైవర్‌ను బయటకు తీసుకొచ్చారు. డ్రైవర్‌కు తీవ్రగాయాలవగా వెంటనే 108 వాహనంలో పాలకొల్లు తరలించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. లాకుల వద్ద గత కొన్నేళ్లుగా నిద్రగన్నేరు చెట్టు అడ్డుగా ఉండటంతో కమిటీ సభ్యుల తీర్మానం మేరకు చెట్టు, చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టినట్టు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

తణుకులో ఐటీ అధికారుల దాడులు

తణుకు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):తణుకులో రెండు రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ఐటీ అధికారుల దాడుల విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన రియల్టర్ కాటూరి లక్ష్మణరావు, వేల్పూరుకు చెందిన నున్నా దుర్గాప్రసాద్ ఇళ్లు, కార్యాలయాలపై ఏకకాలంలో అధికారులు దాడులు చేసినట్టు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలోని తణుకు మున్సిపల్ పరిధిలోని టీడీఆర్ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఐటీ అధికారులు దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇరువురి నివాసాలు, కార్యాలయాలపై ఏకకాలంలో దాడులు చేసి కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. టీడీఆర్ కుంభకోణంలో అప్పటి మున్సిపల్ కమిషనర్‌తోపాటు మరో ముగ్గురు అధికారులపై వేటు వేసిన విషయం విదితమే. ఇప్పటికే ప్రభుత్వం టీడీఆర్ కుంభకోణంలో వాస్తవాలను తేల్చేందుకు సీబీఐ, ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇపుడు ఐటీ దాడులు ప్రాధాన్యం సంచరించుకుంది.

9న మార్కెట్ పాట

నరసాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మార్కెట్ పాటను ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంజయ్య చెప్పారు. ఉదయం 11 గంటలకు కమిషనర్ కార్యాలయంలో పాట జరుగుతుందన్నారు. పాల్గొనే పాటదారులు రూ. 3 లక్షల ధరావతుతో పాటు రూ. 5 లక్షల విలువ చేసే సాల్వెన్సీని చూపించాలన్నారు. పాట బహిరంగ పద్ధతిలో జరుగుతుందన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

భీమవరం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం గునుపూడి మునిసిపల్ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు కళ్లజోళ్లను డీఎంఅండ్‌హెచ్‌ఓ గీతాబాయి అందించారు. గొల్లవానితిప్ప పీహెచ్‌సీ వైద్యుడు బి.రామకృష్ణ కంటి పరీక్షలు చేసి దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి కళ్లజోళ్లను అందించారు. వైద్యాధికారిణి భావన తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆటిజం సేవలను వినియోగించుకోవాలి

తణుకు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆటిజం సేవలను ఆర్ఎస్‌కె, డీఈఐసీ సెంటర్లలో ఉచితంగా వినియోగించుకోవచ్చని నోడల్ అధికారి డాక్టర్ భావన అన్నారు. బుధవారం ఆటిజం అవగాహన దినం సందర్భంగా జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో అవగాహన సదస్సులో ఆమె ఆటిజం లక్షణాలు, నివారణ, వైద్య సేవలపై వివరించారు.

పెంటపాడు: ఆటిజం ఒక నాడికి సంబంధించిన రుగ్మత అని హెచ్ఎం ప్రసాద్ అన్నారు. పెంటపాడు స్థానిక పోస్టుబేసిక్ భవిత విద్యావనరుల కేంద్రంలో ఆటిజంపై అవగాహన కార్యక్రమాన్ని ఐఈఆర్‌టీ ఉపాధ్యాయిని సునీత అధ్యక్షతన నిర్వహించారు.

నేడు, రేపు సోపానం ఇంటర్వ్యూలు

మొగల్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చంద్రన్న స్వయం ఉపాధి సోపానం పథకంలో రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 3, 4 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో సిహెచ్. త్రిశూలపాణి ప్రకటనలో తెలిపారు. 3న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం, కొత్తపాలెం, ముత్యాలపల్లి, మోడి, కొత్తోట, వారతిప్ప గ్రామాల దరఖాస్తుదారులకు 4న కాళీపట్నం తూర్పు, పడమర, పాతపాడు, జగన్నాథపురం, కోమటితిప్ప, కేపీ పాలెం, పేరుపాలెం నార్త్, సౌత్ పంచాయతీలకు చెందిన బీసీ, ఈడబ్ల్యుఎస్, కాపు కమ్యూనిటీ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని దరఖాస్తుదారులు హాజరు కావాలని కోరారు.

కాళ్ళలో తొలిరోజు 564 మందికి ఇంటర్వ్యూలు

కాళ్ళ: కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలకు అభ్యర్థులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణం లబ్ధిదారులతో కిక్కిరిసిపోయింది. దొడ్డనపూడి, బొండాడ, ఏలూరుపాడు, జక్కరం, కలవపూడి గ్రామాల్లో వివిధ యూనిట్లకు సంబంధించి లోన్లు కోసం దరఖాస్తు చేసుకున్న 564 మందికి తొలిరోజు ఇంటర్వ్యూలు జరిపినట్లు ఎంపీడీవో జి.స్వాతి తెలిపారు. గురువారం మరో 8 గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె తెలిపారు.

పోడూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సోపానం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 128 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 89 మంది హాజరైనట్లు ఎంపీడీవో బి.మంగాకుమారి తెలిపారు. పలు బ్యాంకులకు మేనేజర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన పీడీ

కాళ్ళ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలం బొండాడపేటలో ఉపాధి పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేసీహెచ్ అప్పారావు బుధవారం తనిఖీ చేశారు. పంచాయతీకి సంబంధించిన పశువులు చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి మస్తరు రికార్డులను పరిశీలించారు. 3307 పనిదినాలు అంచనాతో రెండెకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో సుమారు రూ. 10 లక్షలతో చేపట్టిన పనులు పారదర్శకంగా జరగాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కి సూచించారు. ఎంపీడీవో జి.స్వాతి, ఏపీవో కె.శ్రీనివాసరావు, సర్పంచ్ మధుసూదనరావు, టెక్నికల్ అసిస్టెంట్ వీవీ మణికంఠ, ఫీల్డ్ అసిస్టెంట్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరించండి: సీపీఎం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ కాలనీలు, టిడ్కో గృహాల్లో మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ కోరారు. బుధవారం సీపీఎం ప్రతినిధి బృందంతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, 6 పట్టణాల్లో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో సీపీఎం నాయకుల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. 650 ప్రభుత్వ కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. తణుకు పట్టణంలో టిడ్కో గృహాలు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. సీపీఎం జిల్లా నాయకులు వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ సేవలను ప్రైవేటీకరించవద్దు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల ద్వారా ప్రజలకు అందించే సేవలను ప్రైవేటీకరించాలనే యోచనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భీమవరంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఆప్కాస్‌ను రద్దు చేయవద్దని, పౌరసేవలను ప్రైవేటుకు అప్పగించవద్దని, మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు ఆంజనేయులు తదితరులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి : కోనాల

భీమవరం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా తనిర్వహించి, డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఇళ్ళ స్థలాలు మంజూరు చేసే వరకు ఇళ్ల స్థలాల సాధన సమితి ఏర్పాటు చేసి దశల వారీగా పోరాటం చేస్తామని కోనాల హెచ్చరించారు. సీపీఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు, చల్లబోయిన రంగారావు, ఎం. సీతారాం ప్రసాద్, ఖాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ప్రిన్సిపాల్‌ను సత్కరించిన దృశ్యం

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

భీమవరంటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని డీఎన్నార్ కళాశాల రిటైర్డు చీఫ్ గ్రంథాలయ అధికారి డా. అల్లూరి నరసింహరాజు అన్నారు. సర్ సీవీ రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలల పుస్తక పఠన దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధి కమిటీ సభ్యుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. రంగసాయి, ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకాలనూ చదవాలి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పఠశాల హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠ్యపుస్తకాలతో పాటు బాలల కథల పుస్తకాలను, వార్తా పత్రికలను చదవాలని సూచించారు.

వృద్ధాశ్రమం సేవలు అభినందనీయం

పాలకొల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ సభ్యులు విశ్వమానవ వేదిక ఆధ్వర్యంలోని వృద్ధుల ఆశ్రమం, గోశాలను బుధవారం సందర్శించారు. వేదిక నిర్వాహకులు మల్లుల సురేష్, డాక్టర్ జ్ఞానేశ్వరి సేవలను అభినందించారు. సురేష్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పాలకొల్లు పరిసర గ్రామాల్లో ఇంటి నుంచి బయటకు రాలేని వృద్ధులు 220 మందికి ప్రతి రోజూ క్యారేజీలతో వారి ఇళ్లకే భోజనం పంపుతున్నామని తెలిపారు. గోశాలలోని ఆవు పాలు, ఇతర ఉత్పత్తుల విక్రయంతో వచ్చిన ఆదాయంతో నిత్యాన్నదాన పథకం నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. సంఘ నాయకులు వంగా నరసింహారావు, గుత్తుల సత్యనారాయణ మూర్తి, మామం బాలకొండల రావు, సభ్యులు సందర్శించారు.



నిలిచిపోయిన మహిళా సమాఖ్య భవనం

5 ఏళ్లుగా.. ఎదురుచూపు

- నిర్మాణం పూర్తికాని మండల మహిళా సమాఖ్య భవనం
- ప్రస్తుతం చిన్న భవనంలోనే కార్యాలయం

మొగల్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు భవానీ కాలనీలో గత టీడీపీ హయాంలో నిర్మాణం చేపట్టిన మండల మహిళా సమాఖ్య భవనం నిర్మాణం పూర్తి చేయాలని మహిళా సమాఖ్య సభ్యులు కోరుతున్నారు. టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు చొరవతో రూ.60 లక్షలు నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణం చేపట్టారు. స్లాబ్ వరకు వేసి వదిలేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ భవన నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో భవన నిర్మాణం పూర్తికాలేదు. సొంత భవనం లేక మండల సమాఖ్య కార్యాలయాన్ని మొగల్తూరు గ్రామ సమాఖ్య కార్యాలయ చిన్న భవనంలోనే నిర్వహిస్తున్నారు. మహిళలకు శిక్షణ ఇచ్చేం దుకు చేపట్టిన భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని పడమటిపాలెం మహిళా సమాఖ్య ప్రతినిధి రావూరి క్షీర వర్ధిని గత నెలలో మొగల్తూరులో నిర్వహించిన గ్రామా భివృద్ధి సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. అలాగే మండల మహిళా సమాఖ్య గ్రామ సంఘాల ప్రతినిధులు భవన నిర్మాణం పూర్తి చేయించాలని కోరుతున్నారు.



ఏకలవ్యుడి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న రఘురామ

ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటు భేష్

ఉండి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటు అభినందనీయమని ఉండి ఎమ్మెల్యే, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం ఉండిలో ఎస్టీలకు రఘురామ ఎంపీగా ఉన్న సమయంలో మంజూరు చేసిన నిధులతో సుమారు రూ. 10లక్షలతో కమ్యూనిటీ హాలును నిర్మించుకున్నారు. దీనిని రఘురామకృష్ణరాజు ప్రారంభించి మాట్లాడుతూ కమ్యూనిటి హాలుతో పాటు ఇదే ప్రాంగణంలో ఏకలవ్యుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా వుందన్నారు. నియోజక వర్గ అభివృద్దే తన ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం మండలంలో పెదపుల్లేరు, కలిసిపూడి, చెరుకువాడలో రహదారులను ఆయన ప్రారంభించారు. పెదపుల్లేరులో మాజీ మంత్రి, దివంగత కలిదిండి రామచంద్రరాజు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన టీడీపీకి అందించిన సేవలను కొనియాడారు. ప్రజలకు పూర్తి స్థాయిలో మంచినీరు అందించడమే ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. పెదపుల్లేరు, చెరుకువాడలలో మైక్రోఫిల్టర్ మంచినీటి పథకాలను ప్రారంభించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాగునీటి ఇబ్బందులు రానివ్వద్దు

పెంటపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి హైమవతి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీకి కాలువలు కట్టివేస్తున్నందున ఈ లోగా చెరువులు నింపుకోవాలన్నారు. మండలంలో కాలువలు ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నామని ఈ పనిలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు భాగస్వాములు కావాలని, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలను ప్రక్కన పెట్టి కలసి ముందుకు వెళ్ళాలని సూచించారు. ఎంపీపీ దాసరి హైమవతి మాట్లాడుతూ అధికారులు ఏ పనిచేసినా గ్రామాలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం, ఏవో పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్ష ఆర్థిక సాయం అందజేత..

తాడేపల్లిగూడెం అర్బన్: కూటమి శ్రేణులకు ఏ కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త చెప్పుల వాసు కిడ్నీ సమస్యతో బాధపడుతుండటంతో బుధవారం ఎమ్మెల్యే బొలిశెట్టి రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. పుల్లా బాబి, కొనకళ్ళ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆరిమిల్లి

సంస్థాగత నిర్మాణంపై దృష్టి

తణుకు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సంస్థాగత నిర్మాణంపై టీడీపీ ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జ్‌లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సారథుల నియామకాలు ఈ నెల 30లోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి 60 ఓటర్లకు ఒక పురుషుడు, ఒక మహిళ ఉండేలా కుటుంబ సాధికార సారథులను నియమించుకోవడం జరుగుతుందన్నారు. పట్టణంలో 1300 మంది సారథుల నియామకానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

శాకాంబరిగా బాలా త్రిపుర సుందరి



భీమవరం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రు లను పురస్కరించుకుని భీమవరం మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారిని శాకాంబరిగా అలంకరణ చేశారు. బుధవారం కూరగాయ లు, పండ్లతో అలంక రించారు. వసంత నవరాత్రుల్లో ప్రతిరోజూ అమ్మవారికి ఒక అలంకరణ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

మొగల్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు కోరారు. మొగల్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాలకు సంబంధించి రీ సర్వే ప్రాజెక్టుపై నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లోని రైతులకు, భూయజమానులకు నోటీస్ లేదా ఫోన్ లేదా వాట్సాప్ సందేశం ద్వారా తెలియపర్చడం జరుగుతుందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలను సర్వేయర్ ఆర్.ఐ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రికార్డులను సవరణ చేసి అధికారులకు అందజేస్తారన్నారు. రైతులు భూ వివాదాలను పరిష్కరించుకోవాలన్నారు.



మొగల్తూరులో రీ సర్వేపై ర్యాలీ

పెంటపాడు: భూముల రీసర్వే గ్రామ సభలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి అన్నారు. బుధవారం బీ.కొండేపాడు, పడమర విప్పర్రు గ్రామ సభలను ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం అధ్యక్షతన నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో తదితరులు పాల్గొన్నారు.



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

భీమవరం రూరల్/టౌన్ ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి అన్న నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరం మండలంలోని కొమరాడ, అనాకోడేరు, గొల్లవానితిప్ప గ్రామాల్లో సుమారు రూ. కోటి 90 లక్షలతో నిర్మించిన 5 సీసీ రోడ్లను బుధవారం ఆయన రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మితో కలసి ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా రహదారులు గోతుల మయంగా ఉండేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారుల నిర్మాణం చేపట్టిందన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

అత్తిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండలంలో గురువారం నుంచి ఆధార్ మొబైల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో పి శ్యామ్యూల్ తెలిపారు. 3, 4 తేదీల్లో లక్ష్మీనారాయణ పురం, పాలి, తిరుపతిపురం గ్రామాల్లోనూ, 8, 9 తేదీలలో ఉనికిలి, ఉరదాళ్లపాలెం, వరిగేడు గ్రామాల్లో, 10, 11 తేదీల్లో ఆరవల్లి, కొమ్మర, గుమ్మంపాడు గ్రామాల్లో ఏర్పాటు చేస్తారు.

కాళ్ళ: 0 నుండి 6 ఏళ్ళలోపు వయస్సు గల పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగపరచుకోవాలని కాళ్ళ ఎంపీడీవో జి.స్వాతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాళ్ళ మండలంలో 12చోట్ల ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆమె బుధవారం తెలిపారు. బొండాడ, దొడ్డనపూడి-1, జువ్వలపాలెం, కోలనపల్లి సచివాలయాల పరిధిలో క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. పిల్లలకు ఆధార్ నమోదు, పేరులో తేడాలు మార్చుకోవచ్చన్నారు.

పాలకోడేరు: మండలంలో నిర్దేశించిన గ్రామ సచివాలయాల వద్ద 0-6 సంవత్సరాలు గల చిన్నపిల్లలకు స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య తెలిపారు. 3న పాలకోడేరు గ్రామ సచివాలయం-1 వద్ద, గ్రామ సచివాలయం శృంగవృక్షం-1 వద్ద, కోరుకొల్లులోను, 4న కుముదవల్లి, పెన్నాడ అగ్రహారం-1, గ్రామ సచివాలయం మోగల్లు -1, 8, 9 తేదీల్లో కోరుకొల్లు, గొరగనమూడి, కొండేపూడి, 10, 11 తేదీల్లో గరగపర్రు, విస్సాకోడేరు-1 గ్రామ సచివాలయం, వేంద్రలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగపరచుకునే విధంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు.

రీ సర్వే పనులు పరిశీలించిన జేసీ

పాలకోడేరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో తప్పిదాలు జరగకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం పైలట్ గ్రామమైన శృంగవృక్షంలో రీసర్వే పనులకు సంబంధించి పెన్నాడ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ రూమ్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి డేటాను పరిశీలించారు. సిబ్బందికి రీసర్వేపై పలు సూచనలు చేశారు. తొలుత విస్సాకోడేరు గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయు వాహనాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతూ రేషన్ పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు జరిగినా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ విజయలక్ష్మి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులకు నిధులు మంజూరు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైఎస్‌పాలెంలో బుధవారం ఉపాధి పథకం కింద రూ. 48లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 58 పనులు చేపట్టనున్నారు. బుధవారం సర్పంచ్ వైఎస్ నాగముత్యామాంబ పనుల్ని ప్రారంభించారు. రైతులు కాల్వల్లో పేరుకుపోయిన తూడు, డెక్కను తొలగించుకోవాలన్నారు. గతంలో రూ 300 ఉండే కూలీని రూ. 307కి పెంచామన్నారు.

3 ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలోని యాళ్లవాని గర్వు, దొండపేట, లైన్సనగర్‌లలో బుధవారం పాలకొల్లు డివిజన్ డీఈఈ సీహెచ్. రామకృష్ణ కూటమి నాయకులతో కలిసి రూ.16 లక్షలు వ్యయంతో 3 ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో లోవోల్టేజి పరిష్కారం అవుతుందన్నారు. ఏఈ కె.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై సమీక్ష

పెనుమంట్ర, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం జుత్తిగ శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులుపై దేవదాయ శాఖ డిప్యూటీ ఈఈ సైదా బుధవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. ఆలయ కోనేరు, హోమ శాల, గోశాల అభివృద్ధి పనులపై స్థానిక నాయకులతో సమీక్షించారు. ఏఈఈ రాజ్ కుమార్, ఈవో సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

పెనుమంట్ర, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రబీకి సంబంధించి ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేయాలని తహసీల్దార్ వై. రవి కుమార్ అన్నారు. బుధవారం పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో దాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ముందుగానే గోనె సంచులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

చదువుతోనే అభివృద్ధి అని చాటిన వెంకన్న

పెనుమంట్ర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధించవచ్చని సమాజానికి చాటిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ (ఆర్అండ్‌బీ) పరువు వెంకన్న యువతకు ఆదర్శప్రాయుడని గొల్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం పొలమూరులో వెంకన్న 102 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమారు 85 ఏళ్ల క్రితం రాత్రి బడులు నిర్వహించి దళితులకు విద్యను అందించిన విద్యావేత్త వెంకన్న అని రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ అధికారి సూర్య ప్రకాష్ రావు అన్నారు. ప్రజా చైతన్యం కోసం పాలేరు నాటకాన్ని దళితవాడల్లో ప్రదర్శించి విద్యా వికాసానికి కృషి చేశారని చెప్పారు. దళిత నాయకులు తాడిపత్తి రవి ప్రకాష్, ల్యాబ్ కిషోర్, విల్లూరి చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



వెంకన్న విగ్రహం వద్ద నాయకుల నివాళులు

ఆధ్యాత్మికం

పెనుగొండ: వడలిలో అగస్త్యేశ్వర స్వామి ఆలయ గాలి గోపురం శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, ధాన్యాధివాసం నిర్వహించారు. సాయంత్రం అంకురారోహణ, వాస్తు హోమాలు నిర్వహించారు. గురువారం ఉదయం శిఖర ప్రతిష్ఠ జరగనుంది. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ

ఆకివీడు: మాదివాడ కోదండ రామాలయంలో పునఃప్రతిష్ఠించిన విగ్రహాలకు బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ దంపతులు, సాయి అరవింద్ ప్రత్యేక పూజలు చేశారు. మోటుపల్లి గంగాధరరావు కుటుంబ సభ్యులు పంచలోహ ఉత్సవ విగ్రహాలు అందచేశారు.

ముఖదారమ్మకు అంగర పూజలు



పాలకొల్లు అర్బన్: స్థానిక అచ్చుగట్లపాలెంలోని ముఖదారమ్మ జాతర నాల్గో రోజున అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి గాజులు, పసుపు, కుంకుమ అందజేసింది.

ఇంటర్వ్యూ..

ఏప్రిల్ 15 వరకు పశుగణన

కరణం శంకర్ భావనారాయణ, మండల పశువైద్యాధికారి, తణుకు



- **జాతీయ స్థాయిలో చేపట్టిన పశుగణన మండలంలో ఎంత వరకు వచ్చింది?**
  జవాబు: జాతీయ 21వ పశుగణన తణుకు మండలంలో ఇప్పటి వరకు 90 శాతం పూర్తైంది.
- **పశు గణనకు ఎప్పటి వరకు గడువు?**
  జవాబు: ఏప్రిల్ 15 వరకు పశు గణన పూర్తి చేసేందుకు గడువు.
- **మండలంలో పశువుల వివరాలు?**
  జవాబు: తణుకు మండలంలో ఆవులు 941, గేదెలు 4,667 ఉన్నాయి.
- **మండలంలోని ఎన్ని పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు?**
  జవాబు: మండలంలో మొత్తం 5,608 పశువులకు టీకాలు వేశాం.

(ఆంధ్రజ్యోతి-తణుకు రూరల్)

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా యడ్ల శివాజీ

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 14 ఏళ్ళుగా సేవలందిస్తున్న యడ్ల శివాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలను పంపినట్టు శివాజీ బుధవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ నాయకులు శివాజీని అభినందించారు.

మాజీ మంత్రి కొట్టు వ్యాఖ్యలు హాస్యాస్పదం

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తున్నప్పటికీ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో విజయం సాధించిన ఏడాది వరకూ హామీల జోలికి పోలేదని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసినా సీఎం చంద్రబాబు హామీలను అమలు చేస్తున్నారన్నారు.

వైసీపీకి మేడపాటి గుడ్‌బై

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కారణాల దృష్ట్యా తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని మాజీ కౌన్సిలర్, వైసీపీ సీనియర్ నాయకుడు మేడపాటి జనార్దనరెడ్డి స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను 18వ వార్డు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నానని, పదవికి, వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. తమ వార్డు ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని స్పష్టం చేశారు.

చలివేంద్రాల ఏర్పాటు

తణుకు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థ తెలిపారు. మల్లిన అరుణసారథి ఆర్థిక సాయంతో వీటిని చేశామన్నారు. రొటేరియన్లు ప్రగతి రాజా, గమిని రాంబాబు, అక్కిన కాశీ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంటౌన్: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి మజ్జిగ చలి వేంద్రాన్ని ఎమ్మెల్యే అంజిబాబు బుధవారం ప్రారంభించారు. నిర్వాహకులు, గ్రీన్ పార్క్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 16 ఏళ్లుగా ఈ చలివేంద్రంలో 70 రోజులు పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు పడాల విజయ్ కుమార్, కార్యదర్శి కందికట్ల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో అగ్నిప్రమాదం

నరసాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రాంగణాన్ని శుభ్రం చేసి చెత్తను ఓ మూలన ఉంచారు. కొందరు ఆకతాయిలు దీనికి నిప్పు పెట్టడంతో మంటలు ఎగసి పడ్డాయి. సబ్‌ట్రెజరీ, తహసీల్దార్ కార్యా లయానికి వెళ్లే విద్యుత్ వైర్లకు మంటలు అంటుకోవడంతో మరింత రాజు కున్నాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి తెలప డంతో సకాలంలో మంటల్ని అదుపు చేయడం వల్ల పెనుప్రమాదం తప్పింది. సాయంత్రానికి కాలిన వైర్లను పునరుద్ధరించారు. కార్యాలయం బయట ప్రమాదం జరగడం వల్ల ఆస్తినష్టం జరగలేదు.

వాహనం బోల్తా.. తప్పిన ముప్పు

మొగల్తూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు 216 జాతీయ రహదారిపై వెళుతున్న బొలేరో వాహనానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. లాకు పల్లవపాలెం సమీపంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ వద్ద వాహనానికి టైర్లు పంక్చర్ కావడంతో రహదారి వెంబడి గల సుమారు 10 అడుగుల లోతులో ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు.